

యథేచ్ఛగా..

బందరులో మట్టి, బుసక దందా!

చినయాదరలో రేయింబవళ్లు మట్టి తవ్వకాలు



మచిలీపట్నం సౌత్, నార్త్ మండలాల్లో మట్టి, బుసక దందా యథేచ్ఛగా సాగుతోంది. చినయాదర గ్రామంలోని తుమ్మాచెరువు నుంచి నాలుగు నెలలుగా మట్టిని తవ్వి స్థానిక ప్రజాప్రతినిధి అమ్ముకుంటున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే స్థానికులను అనేక రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. కరగ్రహారం, మంగినపూడి, గోపువానిపాలెంలో బుసక దందా బరి తెగించింది. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా బుసక అమ్మకాలు చేస్తూ భారీగా దోచుకుంటోంది. మట్టి, బుసక దందాలపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



చినయాదరలో ట్రాక్టర్లలో తరలిపోతున్న మట్టి

- ప్రశ్నించిన గ్రామస్థులకు ప్రజాప్రతినిధి నుంచి బెదిరింపులు
- కరగ్రహారం, మంగినపూడి, గోపువానిపాలెం గ్రామాల్లో జోరుగా బుసక విక్రయాలు
- వైసీపీ, కూటమి శ్రేణులు కుమ్మక్కై ధనార్జన!
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చినయాదరలోని తుమ్మాచెరువులో మట్టి తవ్వకాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం సౌత్ మండలం పెదయాదర పంచాయతీ శివారు చినయాదర గ్రామంలో తుమ్మాచెరువు ఆరున్నర ఎకరాల విస్తర్ణంలో ఉంది. ఈ చెరువులో గతంలో ఏటా స్థానికులు ఉపాధి హామీ పనులు చేసేవారు. ఈ ఏడాది ఈ చెరువును తన గుప్పిట్లోకి తీసుకున్న స్థానిక ప్రజాప్రతినిధి మార్చి నెలలో మట్టి తవ్వకం పనులను ప్రారంభించాడు. రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.800 నుంచి రూ.1200లకు విక్రయాలు జరుపుతున్నాడు. పంచాయతీ తీర్మానం లేకుండానే మట్టిని తవ్వుతుండటంతో స్థానికులు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా మట్టితవ్వకాలు నిలిపివేయలేదు. నెలరోజుల క్రితం చినయాదర గ్రామస్థులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అన్ని ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా మట్టి తవ్వకాలు ఆగలేదు.

5 వేల ట్రక్కుల మట్టిని తరలించేశారు..

చినయాదర గ్రామంలోని తుమ్మాచెరువులో ఆరు అడుగుల లోతున మట్టిని తవ్వి, గత నాలుగు నెలలుగా 5వేల ట్రక్కులకుపైగా అక్రమంగా తరలించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మట్టి విక్రయించగా వచ్చిన నగదును పంచాయతీకి జమచేయలేదని చెబుతున్నారు. ఈ నాలుగు నెలల వ్యవధిలో రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల విలువైన మట్టి విక్రయించేశాడని విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి మట్టిదందాపై వ్యతిరేకత వస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు తవ్వకాల ఫొటోలు, వీడియోలు తీయించి తెచ్చి మరీ ఇటీవల మంత్రి మిగతా 6లో..



రాకీ అవెన్యూస్, విశ్వ సంస్థల

రహస్య బంధం!

చంద్రిక అయోధ్య మోసంలో కొత్త కోణం!

- అజ్ఞాతంలోని 'రాకీ' ఎండీ వేణు రామయ్య 'విశ్వ' ద్వారా వెలుగులోకి..
- ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక నుంచి రాక
- రిజిస్ట్రేషన్ చేశాక ఎవరికంటా పడకుండా అటునుంచి అటే..
- ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు దారులను మోసం చేశారా?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ /గన్నవరం): చంద్రిక అయోధ్య గ్రూప్ అపార్ట్‌మెంట్స్ నిర్మించిన రాకీ అవెన్యూస్, ఈ అపార్ట్‌మెంట్స్‌ను తాము కొనుగోలు చేశామని చెప్పుకుంటున్న విశ్వ సంస్థల మధ్య రహస్య బంధం ఉన్నట్టు సమాచారం. రాకీ అవెన్యూస్ ఎండీ వేణు రామయ్య, విశ్వ సంస్థకు చెందిన వల్లభనేని వంశీ అనుచరుడు గుర్రం నాని మూడో కంటికి తెలియకుండా మంతనాలు చేస్తున్నట్టు తెలిసింది. అరెస్టు వారెంట్ జారీ కావటంతో పారిపోయిన వేణు రామయ్య.. గుర్రం నానితో టచ్‌లో ఉన్నట్టుగా సమాచారం. అరెస్ట్ వారెంట్ తర్వాత కొందరు కొనుగోలు దారులకు ఫ్లాట్ రిజిస్ట్రేషన్స్ జరిగాయి. ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్ చేసే అధికారం రాకీ అవెన్యూస్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే చట్టబద్ధంగా గుర్రం నాని సంస్థ 'విశ్వ'కు బదిలీ జరగలేదు. దీంతో కొనుగోలుదారులకు వేణు రామయ్య గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రహస్యంగా వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవహారాలు వెలుగులోకి మిగతా 6లో..

వాణిజ్య బ్యాంకులకు

దీటుగా సేవలు

ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

- ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం
- పీఏసీఎస్ మార్గదర్శిని పుస్తకం ఆవిష్కరణ



కేడీసీసీబీ ఆవరణలో సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, చిత్రంలో కేడీసీసీబీ చైర్మన్ రఘురామ్ తదితరులు

మచిలీపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకులకు దీటుగా రైతులకు సేవలు అందించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనలతో సహకార బ్యాంకులను మరింతగా బలోపేతం చేసి, రైతులకు సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. కేడీసీసీబీ రూ.11,500 కోట్లకుపైగా టర్నోవర్‌తో ఉందన్నారు. 2024-25 సంవత్సరంలో రూ.76 కోట్ల లాభాల్లో ఉందని తెలిపారు. గ్రామీణ రైతులు, వృత్తిదారులు, వ్యాపారులకు ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. ఈ బ్యాంకు రాష్ట్రంలోని వివిధ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ కేడీసీసీబీ ఎందరో సహకారవేత్తల కృషి ఫలితంగా ఇంతటి పటిష్టస్థితిలో ఉందన్నారు. కాలానుగుణంగా సాంకేతికతను సంతరించుకుంటూ, నూతన పథకాలను ప్రవేశ పెడుతూ, వనరులను సమీకరించుకుంటూ ప్రగతి పథంలో పయనిస్తోందని తెలిపారు. మంచి బ్యాంకు ద్వారా రైతులకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, మరింతగా బ్యాంకును అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తానన్నారు. ఆప్కాబ్ ఎండీ ఆర్.శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2022లో జిల్లాలో ఆరు డివిజనల్ క్రెడిట్ ప్రాసెసింగ్ సెంటర్లను ప్రారంభించిందని తెలిపారు. వ్యవస్థలను సక్రమంగా నడిపించటంలో ఉత్తమ ఫలితాలు సాధించిందని కొనియాడారు. ఈ బ్యాంకు పనితీరు పరిశీలించేందుకే రాష్ట్రంలోని మిగిలిన 12 జిల్లాల బ్యాంకుల సీఈవోలను మచిలీపట్నం పిలిచామన్నారు. రైతు నేస్తం పథకాన్ని కూడా మొదటగా కేడీసీసీబీ ప్రారంభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్ విద్యాధికారి కె.భోజరంగరాజు అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 ప్రాముఖ్యతను వివరించారు. కేడీసీసీబీ సీఈవో ఎ.శ్యామ్ మనోహర్ బ్యాంకు ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మిగతా 6లో..

బదిలీల దుమారం!

గ్రామ వ్యవసాయ సహాయకుల తుది జాబితా రెడీ

మహిళలకు 100 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్‌లు! ‣ ఇప్పటికే స్వస్థలాలకు 50-60 కిలోమీటర్ల దూరంలో ఆరేళ్లుగా విధులు

- దూరం తగ్గిస్తారని ఆశిస్తే మరింత పెంచారు!
- ఎన్టీఆర్, కృష్ణా అధికారుల నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహం
- తుది జాబితాను పునఃసమీక్షించాలని కృష్ణాజిల్లా కలెక్టర్‌కు వినతి
- మహిళా వీఏఏలకు వ్యవసాయశాఖ జేడీ బెదిరింపులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతున్న వీఏఏలు



గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) బదిలీల వ్యవహారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెను దుమారం రేపుతోంది. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల అధికారులు సంయుక్తంగా సిద్ధం చేసిన జాబితా వెనుక భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు లేని విధంగా సొంత మండలంలో పనిచేయకూడదన్న నిబంధనలను పెట్టి అంతర జిల్లా బదిలీలు, మహిళా ఉద్యోగులకు 150, 200 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ప్రతిపాదనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల నియంతృత్వ తీరుపై పలువురు గళమెత్తుతున్నారు. సమస్యలు చెప్పుకొనేందుకు బందరు వెళ్లిన మహిళా వీఏఏలపై జాయింట్ డైరెక్టర్ (జేడీ) బెదిరింపులకు దిగటం మరింత వివాదాస్పదంగా మారింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీఏఏలు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియకు ముందు ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు వీఏఏల నుంచి ఆన్‌లైన్ ఆప్షన్స్‌ను స్వీకరించారు. కోరుకున్న ఆప్షన్స్‌ను గౌరవిస్తామని అధికారులు చెప్పడంతో బదిలీ మార్గదర్శకాలకు అనుగుణంగా గత ఐదారు సంవత్సరాలుగా వీఏఏలు వారి స్వస్థలాలకు దూరంగా సేవలందిస్తున్న మిగతా 6లో..

కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

గ్రామ వ్యవసాయ సహాయకులు తమకు జరిగిన అన్యాయంపై కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. బదిలీల కౌన్సెలింగ్ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రతిపాదించిన జాబితాలను సమ్మతించబోమని తెగేసి చెప్పారు. ఐదారు సంవత్సరాలు స్వస్థలాలకు దూరంగా పని చేసిన నేపథ్యంలో ఉపశమనంగా బదిలీలు ఉంటాయని భావిస్తే.. మరింత దూరానికి బదిలీలు చేయటం తగదని అభ్యర్థించారు. బదిలీల తుది జాబితాను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 67 వేల బంగారు కుటుంబాల గుర్తింపు
‣ కలెక్టర్ డీకే బాలాజీ 6

గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు
మాజీ మంత్రి కొడాలి నాని హాజరు 6

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో పటమట పోలీస్‌స్టేషన్‌కు వంశీ హాజరు

శాకంబరీ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

- షెడ్యూల్ విడుదల చేసిన ఈవో శీనానాయక్
- 8వ తేదీ నుంచి 3 రోజుల పాటు నిర్వహణ



ఇంద్రకీలాద్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ శనివారం ప్రకటించారు. 8వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి విఘ్నేశ్వర పూజతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి కలశస్థాపన, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 9వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సప్తశతి పారాయణం, మహా విద్యాపారాయణం, హోమాలు జరుగుతాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి మూలమంత్ర హవనాలు, మండప పూజలు, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ జరుగుతాయి. 10వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సప్తశతి, మహావిద్యాపారాయణాలు, హోమాలు, శాంతి పౌష్టిక హోమాలు, మండప పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ప్రసాద వితరణలతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారిని మూడు రోజుల పాటు వివిధ రకాల కూరగాయలతో అలంకరిస్తారు. ఆలయ ప్రాంగణాన్ని కూడా వివిధ రకాల కూరగాయలతో అందంగా తీర్చిదిద్దనున్నారు.

● జగన్నాథుని సేవ



మచిలీపట్నంలో జగన్నాథుని రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. వాసుదేవ గోశాల దేశీయ గోవంశ సంరక్షణ సంఘం అధ్యక్షుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిజాంపేట బొబ్బిలి వేణుగోపాల స్వామి గుడి నుంచి ఐదురోడ్ల సెంటర్‌లోని జగన్నాథ మందిరం వరకు కోలాటం, కృష్ణనామ స్మరణతో యాత్ర నిర్వహించారు. జగన్నాథ మందిరం వద్ద స్వామికి నందగోపాల్ దాస్ ఆధ్వర్యంలో పుష్పాభిషేకం జరిపారు. మన్మోహన్‌దాస్ ఆధ్వర్యంలో హారతులిచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని రథయాత్ర వెళ్లే మార్గంలో రోడ్డును శుభ్రం చేసి జగన్నాథుని సేవలో తరించారు.
-ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్

ఆన్‌లైన్‌లో పరిచయమైన మహిళ కోసం వెళ్తే
తన్ని రూ. 3లక్షలు దోచుకున్నారు
‣ పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు 6

ఐఏఎస్‌గా పదేళ్లు పూర్తి..
‣ కలెక్టర్ డీకే బాలాజీకి ఘనసత్కారం





హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

మోపిదేవి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డి కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తికి అందజేశారు.



జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసి వస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు వల్లభనేని వంశీ హాజరు

హనుమాన్‌జంక్షన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కోర్టు షరతుల మేరకు శనివారం జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు హాజరై రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లారు. నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ కేసులో బెయిల్‌పై విడుదలైన వంశీ నూజివీడు కోర్టు విధించిన షరతుల మేరకు ప్రతి బుధవారం, శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిజిస్టరులో సంతకం చేసి వెళ్లాలి. అందులో భాగంగా వంశీ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌తోపాటు మరో కేసులో వీరవల్లి పీఎస్‌లో కూడా సంతకం చేసి వెళ్లారు. ఆయన వెంట అనుచరులు నక్కా గాంధీ, మూల్పూరి ప్రభుకాంత్, దయాల విజయనాయుడు ఉన్నారు.

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో పటమట పోలీస్‌స్టేషన్‌కు వంశీ తదితరుల హాజరు

బెంజ్‌సర్కిల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్‌పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, వి.మోహన్‌రంగా, గంట వీరరాజు, వి.ఎస్.ఆర్ కృష్ణప్రసాద్, ఎల్.లక్ష్మీపతి, వి.వంశీబాబు శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బెయిల్ నిబంధనల ప్రకారం ప్రతి శనివారం పటమట స్టేషన్‌లో సంతకం చేయాల్సి ఉంది. మూడు నెలలపాటు స్టేషన్‌లో హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. దీని ప్రకారం నిందితులందరూ పటమట స్టేషన్‌కు హాజరై సంతకాలు పెట్టి వెళ్లారు. వంశీ అనుచరులు స్టేషన్‌కు తరలివచ్చారు.



గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసేందుకు మందీమార్బలంతో వస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని

గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు మాజీ మంత్రి కొడాలి నాని హాజరు

గుడివాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుకు చెందిన రావి టెక్స్‌టైల్స్‌పై దాడి, రావిపై హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ పొందిన మాజీ మంత్రి కొడాలి నాని నిబంధనల మేరకు శనివారం గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు హాజరై సంతకం చేసి వెళ్లారు. మందీ మార్బలంతో ఆయన పోలీస్‌స్టేషన్‌కు రావడం గమనార్హం. తొలుత రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఇటీవల బెయిల్‌పై విడుదలైన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పరామర్శించేందుకు మాజీ మంత్రి కొడాలి నాని గన్నవరం వెళ్లారు.

అద్విక లెక్కలు ఇవ్వండి : బ్యాంకులకు లేఖలు

విజయవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఖాతాల్లోకి జమ అయిన, తీసుకున్న మొత్తాలకు సంబంధించిన వివరాలను అందజేయాలని పోలీసులు బ్యాంకర్లకు లేఖలు రాశారు. అద్విక కంపెనీ ఎండీ శ్రీవెంకట ఆదిత్య మొత్తం ఐదు బ్యాంకుల్లో ఏడు ఖాతాలు తెరిచినట్టు గుర్తించారు. కంపెనీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఏయే ఖాతాలోకి ఎంతెంత మొత్తంలో డబ్బు జమ అయ్యింది, ఎంత డబ్బు డ్రా చేశారు.. వివరాలను స్టేట్‌మెంట్ల రూపం లో ఇవ్వాలని పేర్కొన్నారు. పోలీసుల విచారణకు సహకరిస్తానని చెప్పిన ఆదిత్య భార్య సుజాతపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఆమెను విచారణ చేసినప్పుడు ఇంట్లో గడవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పింది. చేతిలో రూ.3 వేలు తప్ప ఇంకేమీ లేవని తెలిపింది. ఇలా చెబుతూనే రూ.16 లక్షలు చెల్లించి బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించింది. ఆమె ఆ బంగారాన్ని ఎక్కడ దాచిందో ఎంత అడిగినా చెప్పట్లేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

యథేచ్ఛగా..

(5వ పేజీ తరువాయి)

కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేశారు. మట్టితవ్వకాలపై ప్రశ్నించిన గ్రామస్థులను స్థానిక ప్రజాప్రతినిధి బెదిరించడంతో పాటు, వివిధ రూపాల్లో రెచ్చగొట్టి తన మనుషుల ద్వారా కేసులు పెట్టించి పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నాడని పలువురు మంత్రికి వివరించారు.

పోర్టు, ముడా భూముల్లో ఆగని బుసక దందా!

మచిలీపట్నం నార్త్ మండలంలో పోర్టు కోసం రైతులు గతంలో మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కి విక్రయించిన ప్రైవేటు భూములతో పాటు, అసైన్డ్ భూములను ఎంచుకుని మరీ బుసకను అక్రమార్కులు విక్రయించేస్తున్నారు. బుసకదందాలో ఆరితేరిన కొందరు ముఠాగా ఏర్పడి కరగ్రహారం, మంగినపూడి, గోపువానిపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ భూముల నుంచి దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో టిప్పరులో బుసకను లోడ్ చేస్తే రూ.4,500, ట్రాక్టరుకు రూ.800 చొప్పున అక్రమార్కులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు సముద్రతీరం వెంబడి సహజ సిద్ధంగా మేట వేసిన బుసక గుట్టలను కూడా వదలకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు వస్తుందని గ్రామస్థులు అభ్యంతరం పెట్టినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీస్, ముడా అధికారులు ఆ వైపునకు వెళ్లకుండా మిన్నకుండిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ, కూటమి శ్రేణులు కుమ్మక్కై బుసక దందా నడుపుతూ, తమకు ప్రజాప్రతినిధి అండదండలున్నాయని బాహాటంగానే చెబుతూ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇటీవల కాలంలో రెండు కొత్త ఎక్స్‌కవేటర్లను బుసకదందా నిర్వాహకులు కొనుగోలు చేశారు. వాటిని కొందరు పెద్ద మనుషులతో ప్రారంభించి, బుసక తవ్వకాలకు వినియోగించడం గమనార్హం.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, వేదికపై కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా, ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు

వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర కీలకం

● నియోజకవర్గానికో అభివృద్ధి కమిటీ ● జిల్లాల్లోని వనరులతోనే అభివృద్ధి సాధన ● మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర కీలక అయ్యేలా అందుబాటులో ఉన్న వనరులతో దార్శనిక కార్యాచరణ ప్రణాళిక ముసాయిదా తయారు చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులాంటి దార్శనికత కలిగిన నాయకులు మాత్రమే అభివృద్ధి, భవిష్యత్తు తరాల గురించి ఆలోచిస్తారన్నారు. పీ4 ఫౌండేషన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన శనివారం సమీక్షా సమావేశం జరిగింది. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, వికసిత్ భారత్‌లో రాష్ట్రానికే అధిక ప్రాధాన్యం దక్కుతుందనే నమ్మకముందన్నారు. 2047 నాటికి 18.23 లక్షల కోట్ల జీడీపీ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు ఆయన తెలిపారు. 2023-24లో జిల్లా తలసరి ఆదాయం రూ.3,21,651 ఉండగా దీన్ని 2028-29 నాటికి రూ. 6,38,946కు, 2047 - 48 నాటికి రూ. 62,88,851 లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు వివరించారు.

నియోజకవర్గాల స్థూల ఉత్పత్తి పెంచడం ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గానికో కమిటీ ఏర్పాటు చేసి, ఎమ్మెల్యేను ఇన్‌చార్జిగా నియమించి స్వల్ప, మాధ్యమిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని, సాధన దిశగా అడుగులు వేస్తున్నామని సత్యకుమార్ యదవ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అభివృద్ధిని కోరే వారు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు వివరించారు. జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర, క్వాంటమ్ వ్యాలీ అనుబంధ కార్యకలాపాలతో పాటు ఆధ్యాత్మిక, ఎకో, నదీ పర్యాటకంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వ పథకాలను అనుసంధానంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశమున్న అంశాలు, పర్యాటక రంగాభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ వ్యవసాయ యాంత్రీకరణ వంటి వాటిపై చర్చించి ప్రణాళికల్లో చేర్చాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

సుస్థిర ఉపాధికి నైపుణ్యాభివృద్ధి కీలకం : ఎంపీ కేశినేని శివనాథ్

యువత సుస్థిర ఉపాధి అవకాశాలు పొందడానికి నైపుణ్యాభివృద్ధి కీలకమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆటోనగర్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం, నగరంలో కొత్తగా మరిన్ని ప్రాంతాల్లో ఈట్‌స్ట్రీట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం వల్ల లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జేసీ ఎస్.ఇలక్కియ, మున్సిపల్ చైర్మన్ ధ్యానచంద్ర సీపీవో వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పీ-4 అమలుకు పూర్తి సహకారం ఇవ్వాలి

● ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులతో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 అమలులో రెడ్‌క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పూర్తిస్థాయి కార్యాచరణతో సహకారం అందించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షులు, కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీతో కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఇప్పటి వరకు చేస్తున్న సేవలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో పీ-4 విధానాన్ని అమలుచేస్తుందన్నారు. దీనిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 65 వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు గుర్తించామని, వారందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని చాలామంది దాతలు ముందుకు వస్తున్నారని, పేదరిక నిర్మూలనలో సహాయ సహకారాలు అందిస్తున్నారని కలెక్టర్ వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ సమరం మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో పూర్తిస్థాయిలో తాము భాగస్వామ్యం అవుతామని, తమకు కొన్ని కుటుంబాలను కేటాయిస్తే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కావాల్సిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో గుర్తించిన పేదల జాబితాలు తమకు అందచేస్తే వారిలో కొంతమంది బాధ్యత ను తాము స్వీకరించి వారిని పేదరికం నుంచి విముక్తి కలిగే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముం దుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సెక్రటరీ చిట్టిబాబు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ సమరం, వెలగా జోషి తదితరులు

మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 10న

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఈనెల 10న జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 1500 పాఠశాలల నుంచి రెండు లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరుకానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా సమావేశాలు నిర్వహించనున్నట్లు పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్‌ను కూడా ఇస్తారని, తల్లిదండ్రులు ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా పోటీలను నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రులకు కూడా రంగోలి, టగ్‌ఆఫ్‌వార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందచేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష అధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

రాకీ అవెన్యూస్, విశ్వ సంస్థల రహస్య బంధం!

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వెనుక గేటు నుంచి లోపలికి ప్రవేశించి కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేసి వెళ్లిపోతున్నట్టు ప్రత్యక్షంగా చూసిన కొనుగోలుదారులు చెబుతున్నారు. కొనుగోలుదారులను నిలువునా ముంచిన రాకీ ఎండీ వేణు రామయ్య ఆ తర్వాత వీటిని కొనుగోలుదారులకు అప్పగించే విషయంలో 'విశ్వ'కు అధికారం కట్టబెట్టడంలో కూడా మోసం ఉందని విమర్శలు వస్తున్నాయి. కేవలం ఫ్లాట్ రిజిస్ట్రేషన్స్ సందర్భంలోనే వేణు రామయ్య అజ్ఞాతం వీడి బయటకు వస్తున్నాడు. ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వాటిని అప్పగించే విషయంలో మాత్రం తన పాత్రేమీ లేదన్నట్టుగా అజ్ఞాతంలో ఉంటున్నాడు. ఫ్లాట్స్ పొజిషన్ చూపించాల్సిన తరుణంలో విశ్వ సంస్థకు చెందిన గుర్రం నాని తెర మీదకు వస్తున్నాడు. మెయింటెనెన్స్ పేరుతో లక్షల రూపాయాలు చెల్లించిన వారికే ప్రవేశం కల్పిస్తున్నారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వటం లేదు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాల్సింది వేణు రామయ్యే. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఆ ఫ్లాట్స్ చట్టబద్ధం కావు.

ఎస్‌బీఐ పెద్ద అవుటపల్లి బ్రాంచిపై అనుమానాలు

చంద్రిక అయోధ్య గ్రూప్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసేందుకు పెద్ద అవుటపల్లిలోని ఎస్‌బీఐ బ్రాంచిలో కొందరు కొనుగోలుదారులు రుణాలు తీసుకున్నారు. ఈ రుణాలను డెవలప్‌మెంట్ సంస్థ చేపట్టే పనుల ప్రాతిపదికన ఫేజ్‌ల వారీగా చెల్లించాలి. కానీ ఒకేసారి డబ్బులు చెల్లించేయటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇలా ఎలా చేస్తారని కొనుగోలుదారులు బ్యాంకు అధికారులను ప్రశ్నించగా.. సరైన సమాధానం రాకపోవడతో పలువురు అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. రాకీ అవెన్యూస్, విశ్వ సంస్థల మధ్య రెరా చట్టం మేరకు చట్టబద్ధమైన బదలాయింపు జరగకుండా, బ్యాంకు అధికారులు విశ్వ సంస్థను ప్రస్తుతం మేనేజ్‌మెంట్‌గా ఎలా గుర్తించిందన్నది ప్రశ్నగా ఉంది.

నిబంధనల ఉల్లంఘన

ఫ్లాట్స్ కట్టే సమయంలోనే కొనుగోలుదారుల నుంచి మొత్తం డబ్బులు, ఆ తర్వాత మంచినీరు, ఇతర సదుపాయాలు, ఫైర్ సేఫ్టీకి మళ్లీ నగదు వసూలు చేశారు. కానీ ఏ ఒక్క సౌకర్యం కల్పించలేదు. మొత్తం 670 ఫ్లాట్స్‌తో కూడిన గ్రూప్ అపార్ట్‌మెంట్స్‌కు ఇప్పటి వరకు ఫైర్ అనుమతులు కూడా రాలేదు. దరఖాస్తు చేశారో లేదో కూడా తెలియదు. గన్నవరంలోని కోనాయిచెరువు నుంచి మంచినీటిని అందించేందుకు పైపులైన్లు అయితే వేశారు. కానీ పంచాయితీకి డబ్బులు చెల్లించకపోవటంతో వాటర్ కనెక్షన్‌ను కట్ చేసినట్టు తెలుస్తోంది. కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఫ్లాట్‌లో ఇంకా పూర్తి చేయాల్సినవి అనేకం ఉన్నాయి.

చంద్రిక అయోధ్య నిర్వాహకులపై ఫిర్యాదు

చంద్రిక అయోధ్య బాధితులు గన్నవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తమను నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని సైనిక ఉద్యోగి మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. సైనిక ఉద్యోగి సోదరుడు గన్నవరం పోలీస్ స్టేషన్ అధికారిని కలిసినట్లు తెలిసింది. పోస్టల్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు మరింత మంది బాధితులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదులను స్వీకరించడంలో పోలీసులు నిమగ్నమై ఉన్నారు.

బదిలీల దుమారం!

(5వ పేజీ తరువాయి)

వారంతా దగ్గర ప్రాంతాలకు వస్తామని భావించారు. అయితే ఇప్పటికే తమ స్వస్థలాలకు 50, 60 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్న వీఏఏలకు షాక్‌నిస్తూ మరో 50 - 70 కిలోమీటర్ల దూరం పెంచి పోస్టింగ్‌ల జాబితా తయారు చేసినట్టు వెలుగు చూసింది. అంటే 100, 120 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఉద్యోగులు ఎంచుకున్న ఆప్షన్స్ విధానాన్ని కూడా ఏమాత్రం వ్యవసాయశాఖ అధికారులు గౌరవించలేదని వీఏఏలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా వారికి 100 కిలోమీటర్ల పైనే..

ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, వత్సవాయి, వీరులపాడు, నందిగామ ప్రాంతాలకు చెందిన వీఏఏలు ప్రస్తుతం పమిడిముక్కల, తోట్లవల్లూరు, పామర్రు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఇప్పటికే వీరంతా కూడా తమ స్వస్థలాలకు 50, 60 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్నారు. బదిలీల నేపథ్యంలో ఆప్షన్స్ ఇచ్చినట్టుగా వారికి దగ్గరగా ఉన్న ప్రాంతాలకు పోస్టింగ్‌లు ఇవ్వటానికి అవకాశం ఉంది. కానీ, ఇచ్చిన ఆప్షన్స్‌కు విరుద్ధంగా వీరిని మచిలీపట్నం, నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లోని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయనున్నట్టు సమాచారం. ఇప్పుడు పనిచేసే పని ప్రదేశాలకు మరో 60, 70 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్‌లకు ప్రతిపాదించటం జరిగింది. దీంతో వీరంతా 110 , 120 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. వీరిలో కొంతమందిని మచిలీపట్నం సముద్రతీర ప్రాంతాలకు దగ్గరగా ఉండే వాడపాలెం, గోగిరెడ్డిపల్లి వంటి ప్రాంతాలకు కూడా బదిలీకి సిద్ధం చేసినట్టు తెలిసింది. వీరి స్వస్థలాల నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్‌లు ఇవ్వడానికి సిద్ధం చేయడం గమనార్హం. జగ్గయ్యపేటకు చెందిన ఓ మహిళా వీఏఏ పమిడిముక్కలలో పనిచేస్తున్నారు. ఆమెను తాజా బదిలీల నేపథ్యంలో మచిలీపట్నం సముద్రతీర ప్రాంతం వాడపల్లిలో పోస్టింగ్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఆమెకు 200 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇచ్చినట్టు అయింది. వీరులపాడుకు చెందిన మరో మహిళకు విస్సన్నపేటలో ఇంతకు ముందు పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు అదే మహిళకు బందరు మండలంలో సముద్ర ప్రాంతానికి దగ్గరైన గోగిరెడ్డిపల్లిలో పోస్టింగ్‌కు ప్రతిపాదించారు.

కృష్ణాజిల్లాలో విజయవాడకు దగ్గర్లో ఉండేవారికి పక్కగ్రామాల్లోనే..

విజయవాడకు సమీపంలో కృష్ణాజిల్లాలో ఉన్న పెనమలూరు, కంకిపాడు, గన్నవరం, బాపులపాడు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న అనేక మంది వీఏఏలను వారి పక్క గ్రామాలకు బదిలీ చేసినట్టు సమాచారం. స్థానిక మండలంలో ఉండకూడదు అనే నిబంధనను ఉల్లంఘించి మరీ వీరిని ఎందుకు పక్క గ్రామాలకే బదిలీ చేశారన్నదానికి అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు 10న

సత్యనారాయణపురం, జులై 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయం-1 ఖాళీగా ఉన్న టీచర్ ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేసేందుకు ఈనెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఆదిశేషశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే దినపత్రికలలో ప్రకటన ఇచ్చామన్నారు. సోషల్, ఇంగ్లీష్, ఒకేషనల్ కోర్సు, సంగీతం, గైడెన్స్ అండ్ కౌన్సెలర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించి కాంట్రాక్టు పద్ధతిపై నియామకం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇంజనీరింగ్ అధికారులకు ఎంఈవో షోకాజ్

మోపిదేవి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో విద్యాశాఖ అధికారుల ఆదేశాలు ధిక్కరించి జరుగుతున్న మనబడి - మనభవిష్యత్ పనులపై వివరణ ఇవ్వాల్సిందిగా ఏఈ రాంబాబుకు ఎంఈవో-2 అన్నపరెడ్డి పిచ్చియ్య షోకాజ్ జారీ చేశారు. ఇదేం తీరు అన్న శీర్షికన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పనులపై శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ మనబడి - మన భవిష్యత్ పనులు నిలిపి వేయాలని సర్క్యూలర్ జారీ చేశారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాంబశివరావు ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం లేకుండా పనులు జరుగుతున్నట్లు, వాటిని వెంటనే నిలిపివేయాలని లిఖితపూర్వకంగా లేఖ అందించారు. మన బడి - మన భవిష్యత్ పనుల విషయమై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో మహిళ పరిచయం

● కలిసేందుకు వెళ్తే సదరు మహిళ, మరో ముగ్గురి దాడి

● బెదిరించి ఖాతా నుంచి రూ.3 లక్షల బదిలీ

పెనమలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో పరిచయమైన మహిళను చూడ్డానికి వెళ్లిన వ్యక్తిపై సదరు మహిళ, మరో ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడి, బెదిరించి అతని ఖాతా నుంచి 3 లక్షలకు పైగా సొమ్మును బదిలీ చేయించుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడలోని కృష్ణనగర్‌కు చెందిన రాజు ఒక సంస్థలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు. అతనికి సంవత్సరం క్రితం కొమ్మర రాజేశ్వరి అలియాస్ అమ్ముతో పరిచయం ఏర్పడింది. రాజు గత నెల 24న అమ్ముకు మెసేజ్ చేయగా ఆమె విజయవాడ పీవీఆర్ ఐకాన్ అపార్టుమెంటు వద్ద ఉన్నానని, అక్కడకు రావాలని తెలిపింది. దీంతో అక్కడికి చేరుకొన్న రాజుపై కారులో వచ్చిన అ మ్ము, మరో ముగ్గురు వ్యక్తులు దాడి చేసి కారులోకి తీసుకెళ్లి అతని ఫోన్, ఆరువేల నగదు, బైక్‌కీ, అతనికి సంబందించిన కార్డు లు తీసుకొని అతని ఖాతా నుంచి మూడు లక్షలకు పైగా సొమ్మును వారి ఖాతాలకు బదిలీ చేయించుకొన్నారు. దీనిపై రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



కలెక్టర్ డీకే బాలాజీని పూలకిరీటం, శాలువాతో సత్కరిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

ఐఏఎస్‌గా పదేళ్లు పూర్తి

కలెక్టర్ డీకే బాలాజీకి ఘనసత్కారం

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్ అధికారిగా పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న కలెక్టర్ డీకే బాలాజీని జిల్లా అధికారులు శనివారం రాత్రి జిల్లాపరిషత్ సమావేశ పుహాలులో ఘనంగా సత్కరించారు. అధికారులు మాట్లాడుతూ కలెక్టర్ బాలాజీ ప్రజలకు సేవ చేయాలనే తపన, దయాగుణం, మానవతా దృక్పథంతో పనిచేస్తున్నారన్నారు. క్లిష్టమైన సమస్యలు ఎదురైనప్పుడు సులభంగా ఎలా పరిష్కరించాలో అధికారులకు వివరించి, తనదైన శైలిలో వారితో పని చేయిస్తున్నారని అన్నారు. నేటి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఆయన ఇస్తున్న ప్రేరణ ఆదర్శనీయమన్నారు. విదార్థులను సన్మార్గంలో నడిపే ఉపాధ్యాయులకే కలెక్టర్ శిక్షణ ఇస్తున్న తీరును అధికారులు కొనియాడారు. ఐఏఎస్ అధికారిగా బాలాజీ చేసిన సేవలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపారు.. జిల్లా అధికారులు గజమాలతో కలెక్టర్ డీకే బాలాజీని సత్కరించారు. జడ్పీ డెప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీపీవో అరుణ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, గృహనిర్మాణసంస్థ పీడీ వెంకట్రావ్, డీఎంహెచ్‌వో శర్మిష్ట, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లాలో 67వేల బంగారు కుటుంబాల గుర్తింపు

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ-4 పథకం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమవేశపుహాలులో జేసీ గీతాంజలిశర్మతో కలసి పీ-4 పథకం అమలుపై అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో 67వేల కుటుంబాలను, బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు గుర్తించామన్నారు. ఆర్థికంగా ఉన్నతంగా స్థిరపడిన వారిని గుర్తించి, వారిని బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారితో మాట్లాడించి, దత్తత తీసుకునేలా ప్రోత్సాహించాలన్నారు. ఈ పనిని త్వరితగతిన అధికారులు ప్రారంభించాలన్నారు. గుడ్లవల్లేరు. వాసవీ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకుని, మంచి స్థితిమంతులుగా ఎదిగినవారితో మాట్లాడి, అదే కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సాయం చేసేలా మాట్లాడాలన్నారు. అన్ని మార్గాలలో పేదలకు సాయం చేసే వారిని గుర్తించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు

(5వ పేజీ తరువాయి)

వివరించారు. పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సెల్ చేపట్టబోయే 33 కార్యక్రమాలకు సంబంధించిన 'పీఏసీఎస్ మార్గదర్శిని' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. తొలుత సప్తవర్ణ పతాకాన్ని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కె.భోజ రంగరాజు సహకార పతాక గేయాన్ని ఆలపించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల డీసీసీబీ సీఈవోలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

ఎన్నికల నిబంధనలపై బీఎల్‌వోలకు అవగాహన

గన్నవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమ నిబంధనలపై బీఎల్‌వోలు అవగాహన కలిగి ఉండాలని నియోకవర్గ ఎన్నికల అధికారి టి.శివరామప్రసాద్ అన్నారు. బాలుర జడ్పీ హైస్కూల్‌లో శనివారం నుంచి ఈ నెల 16 వరకు జరిగే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీ, మార్పు చేర్పులు ఉంటాయన్నారు. ఓట్లుపై వివిధ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. 80ఏళ్ల నిండిన ఓటర్ల వివరాలను తప్పక సేకరించాలని సూచించారు. తహసీల్దారు కేవీ శివయ్య, ఎన్నికల డీటీ లక్ష్మీ నాంచారమ్మ, ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దారు చిట్టిబాబు మాస్టర్ ట్రైనింగ్‌లు నవీన్, ఆనందరావు, ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కానూరు పెద్దమసీద్ వీధిలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నజీర్

కానూరులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కానూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ శనివారం కానూరులో పర్యటించి శానిటేషన్, డ్రెయినేజీలను పరిశీలించారు. తులసీనగర్, సిద్ధిక్‌నగర్, సనత్‌నగర్, పెద్ద మసీద్ వీధి, కుద్దూస్‌నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. స్థానికులతో ఆయన మాట్లాడారు. శానిటేషన్‌కు సహకరించాలని, డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదని సూచించారు. దీనిపై ప్రతిఒక్కరిలో అవగాహన పెరగాలన్నారు. కానూరులోని రక్షితనీటి పథకాన్ని పరిశీలించి పలు సూచలను చేశారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో కానూరు మెయిన్‌రోడ్డు కామయ్యతోపు ప్రాంతంలో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.



ఉయ్యూరు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

రెండోరోజు ఆర్టీసీ కార్మికుల ధర్నా

ఉయ్యూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రెండో రోజు శనివారం ఆర్టీసీ డిపో గేటు ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో ధర్నాచేసి, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10వేల మంది సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం అనుమతి, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణకు డిపోలను ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిపో కార్యదర్శి టీసీహెచ్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బ్యాడ్జీల ప్రదానోత్సవం

ప్రసాదంపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎన్నికైన హెడ్ బాయ్ అడం సూర్య ఆస్టన్, హెడ్ గాళ్ ప్రిపా జైన్‌లకు పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ బ్యాడ్జీలను ప్రదానం చేశారు. పాఠశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ అన్నీ కార్యక్రమాల్లో వీరు సహాయకులుగా ఉంటూ పనిచేయాలని సూచించారు. బ్రహ్మపుత్ర, కృష్ణ, గంగ్స,నర్మద హౌసెస్‌లోఎన్నికైన విద్యార్థులకుబ్యాడ్జీలను ప్రదానం చేశారు. స్టూడెంట్ కౌన్సిల్ అందరికీ రోల్ మోడల్‌గా ఉండాలని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పరిమి నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా, ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

ధనేకులలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెనమలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. రీసోర్స్ పర్సన్ మహమ్మద్ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ పవర్ బీఐ విశిష్టత, ఆవశక్యకతను వివరించారు. డేటా ఇంటిగ్రేషన్, డేటా ఫార్మేషన్, అనాలిసిస్, విజువలైజేషన్ గురించి అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జరపడం వల్ల కొత్త టెక్నాలజీ ఆవశ్యకత, మార్పుల పట్ల అవగాహనతో వినూత్నంగా విద్యార్థులకు అధ్యాపకులు బోధించగలరన్నారు. విభాగాధిపతి డాక్టర్ సౌమ్య, చైర్మన్ రవీంద్రనాథ్ ఠాగూర్, సెక్రటరీ ధనేకుల భవానీప్రసాద్, దినకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కంకిపాడులోని ఓ పిండిమర దుకాణంలో అక్రమంగా ఎనిమిది క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఉన్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సివిల్ సప్లయిస్ డీటీ ప్రధాన్, గ్రామ రెవెన్యూ అధికారి మద్దూరు రఘురామ ప్రసాద్ దాడులు నిర్వహించారు. తనిఖీల్లో ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు జైలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు నూజివీడు కోర్టు జైలు శిక్ష విధించింది. కోడూరుపాడు వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా కంకిపాడుకు చెందిన ఆటోడ్రైవర్ కొరపక పూర్ణచంద్రరావు మద్యంతాగి వాహనం నడపడానికి గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు. మొదటి అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముద్దాయికి నాలుగురోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

జూనోసిస్ డే నేడు : రేబిస్ టీకాలు

ఉయ్యూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని ఆదివారం ఉయ్యూరు ప్రభుత్వ పశువైద్యశాలలో కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నట్టు కాటూరు పశువైద్యశాల అధికారి డాక్టర్ వీణ తెలిపారు.

హనుమాన్‌జంక్షన్: ఉచితంగా రేబిస్‌వ్యాధి నిరోధక టీకాలు మండలంలో ఆదివారం వేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ బాపులపాడు ఏడీ ఎం.ప్రమీలారాణి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు త్వరలో టెండర్లు ఆహ్వానం

ఉంగుటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కమర్షియల్ ఆదాయం పెంచుకోవటంలో భాగంగా గన్నవరం బస్‌డిపో పరిధిలోని ఉంగుటూరు ఆర్టీసీబస్టేషన్ స్థలం 15ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ సుమారు 39సెంట్ల(1887గజాలు) విస్తీర్ణం కలిగిన ఉంగుటూరు బస్టేషన్, స్థలంతోపాటు పామర్రు, ఉయ్యూరు, నాగాయలంక బస్ స్టేషన్లలోని ఖాళీస్థలాలు కూడా లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు.



కడవకొల్లులో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న బోడె, వైవీబీ



రంగన్నగూడెంలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



పోరంకిలో అనుమోలు ప్రభాకరరావు తదితరులు



కంకిపాడులో తుమ్మలపల్లి, పులి తదితరులు

కూటమి సుపరిపాలనతో ప్రజాసంక్షేమం

తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు

ఉయ్యూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరి పాలనలో తొలిఅడుగులో భాగంగా శనివారం కడవకొల్లులో ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, రోడ్లు తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసు కువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సర్పంచ్ మంగినేని సుధారాణి, ఎంపీడీవో శేషగిరిరావు, కొండా ప్రవీణ్, వేమూరు శ్రీనివాసరావు, కుప్పాల అంజిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తూ మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాల్లో తొలిఅడుగులో ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, పల్లగాని వీరాంజనేయులు, కసుకుర్తి వేణుబాబు, చిరుమామిళ్ల సూర్యం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా :యార్లగడ్డ

ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన కోడూరుపాడుకు చెందిన ఆర్నేపల్లి సూరిబాబు, చందు సూర్యనారాయణ, వీర్ల బసవేశ్వరరావులను శనివారం పరామర్శించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరులో సుపరిపాలనలో తొలి అడుగులో ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన మాట కోసం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ అవిర్నేని భవానీశంకర్, అధ్యక్షుడు కాజ సురేష్, కార్యదర్శి అంగడాల సీతారామస్వామి, బాణావతుల శ్రీనివాసరావు, నీటి సంఘ అధ్యక్షుడు దోనవల్లి సాయిసీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

పెనమలూరు: పోరంకి ప్రభునగర్ 9వ డివిజన్‌లో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు శనివారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలను అమలు పరుస్తూనే పోలవరం, అమరావతి నిర్మాణంతో కూమటి ముందుకు సాతుందన్నారు. కార్యక్రమంలో దోనెపూడి రమాదేవి, కోడె సముద్రాలు, ముక్కామల నాని, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు. కేసీపీ కాలనీలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఇంటింటికీ తిరిగి అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో దోనేపూడి రవికిరణ్ తదితరులు ఉన్నారు.

కంకిపాడు : వైసీపీ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటున్నారని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ విమర్శించారు. కంకిపాడులో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులు కంటున్న కలలను కూటమి నాయకులు సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్, గ్రామ పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, ఎఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, అన్నే రామారావు, చలవాది రాజ, శివపార్వతి, రాజు, బొర్రా వెంకట్, బాజి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఈడుపుగల్లులో మాజీ ఎంపీపీ దేవినేని రాజ, సర్పంచ్ పందిపాటి ఇందిర, డిసి దేవినేని రత్నభూషన్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, పందిపాటి సుధాకర్, పుట్టగుంట రవి, కాకుళ్ల సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా జగన్నాథ్ రథయాత్ర మహోత్సవం

కానూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథ, బలదేవ, సుభద్ర మహారాణి ఆలంకరించిన రథంపై కానూరులోని శ్రీసాయిగీతా మందిరం వద్ద యాత్ర శనివారం వైభవంగా ప్రారంభమైంది. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, వీసీ ఏవీ రత్న ప్రసాద్, మందిరం అధ్యక్షుడు శ్రీమాన్ చక్రధారి దాస్ పూజా కార్యక్రమాలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. పంటకాల్వరోడ్డు, నాగార్జున హాస్పిటల్స్, ఆటోనగర్ వంద అడుగల రోడ్డు, బందరురోడ్డు మీదుగా ఆటోనగర్ బస్టాండ్ ఎదరుగా ఉన్న శ్రీసాయిబాబా కల్యాణమండపానికి చేరుకుంది. వేలాది మంది పురజనులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. హరినామ సంకీర్తనలతో, కోలాటం, భక్తుల నృత్యాలతో, భక్తులకు ప్రసాదాల పంపిణీలతో వైభవంగా సాగింది. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర మూడు ఏళ్లగా వైభవపేతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. చక్రధారి దాస్ ప్రసంగిస్తూ ఈరథయాత్ర పండితుల నుంచి పామరుల వరకు సేవచేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బలరాం గోవిందా దాస్, వ్రజథామ్ దాస్, శ్రీకాంత్ నరిసింహ దాస్, శ్యామ్ సుందర్ అచ్యుత దాస్, బ్రహ్మచారుల బృందం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 156 కేసుల పరిష్కారం

ఉయ్యూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు జూనిర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించి 156 కేసులు న్యాయమూర్తి కె.శ్రీహరిపరిష్కరించారు. వీటిలో 9 సివిల్, 6 చెక్‌బౌన్స్, 68 ఐపీసీ కేసు లు, పీటీ కేసులు 73 పరిష్కరించి రూ. 38,02, 800 అపరాధ రుసుం, రాజీకేసులకు పరిహా రంగా చెల్లించేలా చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, సీనియర్ న్యాయవాది చంటి బాబు పాల్గొన్నారు.



ఉయ్యూరులో జాతీయ లోక్ అదాలత్

గన్నవరంలో..

కేసులు సత్వార పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ అరుణశ్రీ అన్నారు. గన్నవరంలోని కోర్టులో లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. 8 సివిల్ కేసులు, 139 క్రిమినల్ కేసులు, 5 ప్రీలిటిగేషన్ కేసులు, రూ.74,43,199 నగదును పరిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ ఇరుపార్టీలు రాజీ మార్గాలను ఎంచుకోవాలన్నారు. అప్పుడే ఇరువురికి ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.

శాకంబరీదేవి అలంకరణలో సరస్వతీదేవి

గన్నవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దావాజీగూడెం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం సరస్వతీదేవి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అలంకారం జరిపారు. ఆలయ ప్రాంగణం అంతా కూరగాయలతో అలంకరించారు. సువాసినీలచే సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కూరగాయల వితరణ చేశారు. శాకంబరి అలంకరణ ప్రత్యేక ప్రసాదాన్ని అందజేశారు.



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి

గన్నవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ మండవ రూకేష్ అన్నారు. వీఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకరోత్సవం వేడుక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూకేష్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్య సాధనతో చదువులో రాణించాలన్నారు. భవిష్యత్‌లో దేశాన్ని నడిపించే ఉత్తమ నాయకులు కాగలరన్నారు. బాలుర విద్యార్థి నాయకులు ఎ.నవీన్, బాలికల నాయకురాలు తనిష్క, కళాశాల బాలుర నాయకుడు ప్రణయ్‌కుమార్, బాలికల నాయకురాలు డెన్నిశ్రీ, తరగతుల వారిగా క్యాబినెట్ విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ బాలశౌరి, డాక్టర్ బూరుగడ్డ దినేష్, కె.వాసుదేవ్, ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, సి.జె.థామస్, జిమ్మికురియకోస్, భల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో అల్లూరి జయంతి

కార్మికులను బానిసలుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వం

కంకిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను కట్టుబానిసలుగా మార్చే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మండేపూడి నాగభూషన్ రెడ్డి భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అత్యంత లాభాలు కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి పూనుకుందన్నారు. కార్మికచట్టాలను నీరుగారుస్తూ కేంద్రం తీసుకున్న తప్పుడు నిర్ణయాలను తక్షణం రద్దు చేయాలన్నారు. సమావేశంలో టి.నరేష్, వి. శివశంకర్, సి.హెచ్.శ్రీహరి, వి.జాన్‌మోజస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు అందరి సహకారం అవసరం : సర్పంచ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సర్పంచ్ పిల్లా అనిత అన్నారు. వీరవల్లి ఆర్పీహెచ్ కాలనీలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను శనివారం పంచాయతీ సిబ్బందితో తొలగించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

8 నుంచి పోస్టాఫీసుల్లో అప్‌గ్రేడ్ వ్యవస్థ

● పోస్టల్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్

మచిలీపట్నం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో లావాదేవీలన్నీ ఇకపై పోస్టల్ శాఖ సొంత సాఫ్ట్‌వేర్‌తో నిర్వహిస్తుందని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు పోస్టల్ శాఖ పాలనా వ్యవహారాలను కార్పొరేట్ కంపెనీలు చూసేవని, ఇకపై పోస్టల్ శాఖ సొంత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తూ ప్రజలకు మరింత సేవ అందిస్తామని ఆయన తెలిపారు. అప్‌గ్రేడ్ చేసిన వ్యవస్థ ఈనెల 8వ తేదీ నుంచి వివిధ పోస్టాఫీసుల్లో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.



మత్స్యశాఖ సహకార సంఘ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

మచిలీపట్నం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని, అందుకు సమ్మిళితమై స్థిరమైన అభివృద్ధి మార్గంలో నడవాలని సహకార సంస్థలకు కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటారు. సహకార పతాకాన్ని ఎగరేశారు. మత్స్యశాఖ సహకార సంఘాలు ఫెడరేషన్‌గా ఏర్పడి దళారీల బారిన పడకుండా తమ ఉత్పత్తులను బ్రాండ్ల యూనిట్లుగా ఏర్పాటు చేసుకుని సొంతంగా అమ్ముకునే స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు నాగరమేష్, మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు ఐఏ నాగరాజు, డీసీపీ చంద్రశేఖర్, ఆప్కాబ్ సీఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

● 209 కేసులు పరిష్కారం



స్థలం తగాదాను పరిష్కరించి పత్రాన్ని అందిస్తున్న ఏడీజే పాండురంగారెడ్డి

అవనిగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి నేతృత్వంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 209 కేసులను పరిష్కరించారు. 199 క్రిమినల్ కేసులు, 10 సివిల్ కేసులను పరిష్కరించి రూ.56.79 లక్షల మొత్తాన్ని సెటిల్‌మెంట్‌గా అందజేశారు. ఆరవ అదనపు జడ్జి కోర్టులో మొత్తం 10 కేసులు పరిష్కారమయ్యాయి. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్టులో 67 కేసులు, స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో 132 కేసులను పరిష్కరించారు. ఇళ్ల స్థలం వివాదం కేసును జిల్లా జడ్జి పాండురంగారెడ్డి నేతృత్వంలో పరిష్కరించి పరిష్కార పత్రాన్ని అందజేశారు. పీడీఎం స్వర్ణలత వేల్గా మార్క, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనకా రఘురాంప్రసాద్, న్యాయవాదులు ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, అందె శ్రీరామమూర్తి, సుబ్బారావు, నరహరిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ సూచించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదులను బ్యాంకు ఏపీ రీజనల్ హెడ్ పవన్‌కుమార్‌తో కలిసి వీసీ ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.3 లక్షల 25 వేలతో 3 స్మార్ట్ టీవీలను కేయూకు బహూకరించామని పవన్‌కుమార్ తెలిపారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష, డీన్ వై.కె.సుందరకృష్ణ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు వేయించండి

● పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి చిననరసింహులు

మచిలీపట్నం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు రాకుండా నట్టలతో పశువులు బాధపడకుండా ఉండేందుకు నట్టల నివారణ మందులు వేయించాలని పశుపోషకులకు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సీహెచ్ చిననరసింహులు సూచించారు. ఆర్.గొల్లపాలెంలో శ్రీకృష్ణ గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నట్టల నివారణ మందు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపసంచాలకుడు కె.నాగభూషణం, సహాయ సంచాలకులు జి.ఉమా, చిన్నాపురం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ విమని రెడ్డి, సహకార సంఘ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు పల్లపాటి చినబాబు పాల్గొన్నారు.

డాక్యుమెంటేషన్ కార్యక్రమంలా పీటీఎం

● యూటీఎఫ్ నేతలు

మచిలీపట్నం టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)ను డాక్యుమెంటేషన్ కార్యక్రమంగా మార్చడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు అన్నారు. డీఈవో కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విట్‌నెస్ అధికారిని ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వీడియోలు తీసి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. విద్యాభివృద్ధి, మౌలికసదుపాయాలపైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మాట్లాడుకునేందుకు 17 రకాల కమిటీలు, ఫొటోలు, విట్నెస్ అధికారులు అవసరమా అని నిలదీశారు. యూటీఎఫ్ నేతలు లెనిన్‌బాబు, ఎండీ షౌకత్‌హుస్సేన్, కనకారావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెడన, జూలై 5(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు శనివారం పెడనలో తనిఖీలు నిర్వహించారు. 14, 17 వార్డుల్లోని అద్దె ఇళ్లలో రహస్యంగా దాచి ఉంచిన బియ్యాన్ని గుర్తించినట్లు విజిలెన్స్ ఎస్సై కె.కృష్ణసాయి తెలిపారు. 14వ వార్డులోని ఒక ఇంట్లో 1,050 కిలోలు, 17వ వార్డులోని మరో ఇంట్లో 190 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు కేసులు నమోదు చేశారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

నాగాయలంక, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏటిమొగ గ్రామంలో పేకాట శిబిరంపై శనివారం ఎస్సై కె.రాజేష్ తన సిబ్బందితో మెరుపు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం

చల్లపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక చల్లపల్లిలో జరిగింది. మండల అధ్యక్షుడిగా బి.వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాదరావు, పి.రాజ్యలక్ష్మి, పి.నాంచారయ్య, కార్యదర్శులుగా ఎండీ ఇస్థహని, ఆర్.నవీన్ శ్రీనివాస్, కె.రమాదేవి, టి.రేణుప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా సీహెచ్ రాధారాణి, యు.కృష్ణారావు, కె.సునీతారాణి, ఆడిట్ కన్వీనర్‌గా ఎ.సాయికృష్ణ, సభ్యులుగా కె.అమీన్, కె.అనిల్, బి.నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు ఎన్నికల అధికారిగా, రాష్ట్ర కౌన్సిలర్ జి.వెంకటేశ్వరరావు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు.

నేడు కోనేరుసెంటర్‌లో చెస్ట్‌బీటింగ్

మచిలీపట్నం టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా కోనేరుసెంటర్‌లో వేలాది ముస్లింలు ఆదివారం చెస్ట్‌బీటింగ్ చేయనున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర కోనేరుసెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. శనివారం రాత్రి పంజాల వద్ద నిప్పులు తొక్కారు. పలు పంజాల వద్ద పీర్లు ఊరేగింపులు జరిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో కోనేరుసెంటర్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టారు.





కప్పలదొడ్డిలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, చల్లపల్లిలో పర్యటిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

● సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సాగించిందని, వచ్చే నాలుగేళ్లు సాగిస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం కప్పలదొడ్డిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు నియోజకవర్గ చేనేత సహకార సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు గతంలో చేనేత రంగానికి ఇచ్చిన జీవో అమలు చేయాలని కోరారు. అనంతరం 27 గ్రామ పంచాయతీల పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు కట్టా మునీశ్వరరావు, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, కొఠారి మురళీధర్, కోలపల్లి రజని, వాసన వెంకటేశ్వరరావు, సర్పంచ్ మహమ్మద్ రఫీ, బళ్ల సుబ్బనాగన్న, వాకా శ్రీను, సిరివెళ్ల శ్రీను, కూనపరెడ్డి పెద్దిరాజులు, బాసంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

చల్లపల్లి/ఘంటసాల: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుందని ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చల్లపల్లి పడమరవీధిలో, ఘంటసాలలో ఆయన నిర్వహించారు. చల్లపల్లిలో టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, కోట విజయరాధిక, పైడిపాముల కృష్ణకుమారి, నిడమానూరి దిలీప్‌కుమార్, కొల్లూరి వెంకటేశ్వరరావు, ముమ్మనేని నాని, పైడిపాముల స్వప్న, షేక్ నబీషెరీ పాల్గొన్నారు. ఘంటసాలలో టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, అయినపూడి భాను ప్రకాష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, తాడికొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.10వేల సాయం

అనారోగ్యంతో బాధపడుతున్న చల్లపల్లి నారాయణరావునగర్‌కు చెందిన పైడయ్య భార్య కృష్ణవేణికి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని రూ.10 వేలు సాయంచేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో నగదు అందజేయించారు.

పవిత్రోత్సవాలతో ఆలయాల పవిత్రత ద్విగుణీకృతం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు

అవనిగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పవిత్రోత్సవాలతో ఆలయాల పవిత్రత, శక్తి సామర్థ్యాలు మరింత ద్విగుణీకృతమవుతాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం లక్ష్మీనారాయణస్వామి ఆలయ పవిత్రోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆగమ పండితుడు రొంపిచర్ల భట్టర్ శతృఘ్నాచార్యులు అధ్యక్షతన ఉత్సవాలు జరిగాయి. బుద్ధప్రసాద్ దంపతులు స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు(వాసు) వారిని నూతన వస్త్రాలతో సన్మానించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, అర్చకస్వామి దీవి బాలకృష్ణమాచార్యులు, పాల్గొన్నారు.

షాదీఖానా కమిటీ అధ్యక్షుడిగా సాగిర్ అహమ్మద్

పెడన, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూఘర్ కం షాదీఖానాకు నిర్వహణ కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి అధ్యక్షుడిగా సాగిర్ అహమ్మద్, సభ్యులుగా షేక్ వజీర్ అహమ్మద్ (బాబులు), షేక్ ఎండీ రఫీ, అబ్దుల్ వాహెద్, ఉమ్మే సుమయ(మహిళా న్యాయవాది)ను నియమించారు. నూతన కమిటీని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మాజీ వైస్ చైర్మన్లు హన్ను, రహమాన్ బేగ్ అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఆర్టీసీ కార్మికుల గేట్ ధర్నా

అవనిగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ భోజన విరామ సమయంలో కార్మికులు గేట్ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని, ఉద్యోగుల ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు బి.ఎల్.ప్రసాద్, మహేష్, సురేష్, పాండురంగారావు, కమలశ్రీ, వెంకటలక్ష్మి, ప్రసన్న కుమార్, గ్యారేజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలి

అవనిగడ్డ రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): 2025-26 ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు ఈనెల 10వ తేదీన తల్లికి వందనం నగదు బ్యాంక్ అకౌంట్‌లో అమౌంట్ జమ చేయనున్నారని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి పర్వీ సుల్తాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పేరున ఉన్న బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ నెంబర్ లింక్ కాని వారందరూ బ్యాంకుకు వెళ్లి లింక్ చేసుకోవాలన్నారు. అకౌంట్ లేని విద్యార్థులకు అమౌంట్ జమ కాదని తెలిపారు. బ్యాంక్ అకౌంట్ లేని వారు తప్పనిసరిగా పోస్టు ఆఫీసులో అకౌంట్ ఓపెన్‌చేసి ఆధార్ నెంబర్ లింక్ చేయించుకోవాలని ఆమె సూచించారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

చల్లపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఐ అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శనివారం చల్లపల్లి ప్రధాన సెంటర్లో సీపీఐ నేతలు ఆందోళన నిర్వహించారు. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలతో ఇప్పటికే పేదలతో ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ఏపీ రైతుసంఘం రాష్ట్ర నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నేతలు చంద్ర సుబ్బారావు, అల్లూరి బాబూరావు, నక్కా శ్రీనివాసరావు, సిద్దాబత్తుల బాలయ్య, పెనుమత్స ప్రభాకరరావు, హేమార్జున పాల్గొన్నారు.

బందరులో..

మచిలీపట్నం టౌన్: స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలంటూ గాంధీబొమ్మ శివాలయం సెంటర్ వద్ద సీపీఐ నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మోదుమూడి రామారావు, నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, సహాయ కార్యదర్శి చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం మచిలీపట్నం నియోజకవర్గ సమితి 25వ మహాసభ జరుగుతుందని మోదుమూడి రామారావు తెలిపారు. బెల్ కంపెనీ ఆడిటోరియం నుంచి బేబీసెంటర్ వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గసభ్యురాలు పెనుమత్స దుర్గాభవాని, జిల్లా సమితి కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పాల్గొంటారన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

అవనిగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే పీఆర్సీ కమిషన్ నియామకం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అవనిగడ్డ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రామకృష్ణ, అబ్దుల్ అజీజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం అసోసియేషన్ అవనిగడ్డ శాఖ సమావేశం నిర్వహించారు. ఇటీవల మరణించిన సంఘ సభ్యుడు కె.సి.పాండుకు నివాళులర్పించారు. సంఘ పూర్వ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, సభ్యులు కె.ఎస్.సుధాకర్‌రావు, ఆర్.రాధాకృష్ణ, ఓంకార నాగభూషణరావు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.10 వేల విరాళం

పెడన, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెడనలో గోశాల నిర్మాణం కోసం మచిలీపట్నానికి చెందిన చందన హనుమంతరావు, జయలక్ష్మి దంపతులు రూ.10,001 విరాళం అందించారు. ఈ విరాళాన్ని శనివారం తమ మనుమడు పార్థశ్రీకృష్ణ చేతుల మీదుగా హిందూ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావుకు అందజేశారు.

బీఎల్వోలకు శిక్షణ

పెడన, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో శనివారం గూడూరు మండల బీఎల్వోలకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. గూడూరు, పెడన తహసీల్దార్లు రాజ్యలక్ష్మి, అనిల్‌కుమార్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హోమ్ యాప్‌లో బీఎల్వోల విధులు, బాధ్యతలను వివరించారు. అనంతరం పరీక్ష నిర్వహించి పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు అందజేశారు.

రైతు కూలీ సంఘం నేత శ్రీహరి కన్నుమూత

కోడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సాలెంపాలెం గ్రామానికి చెందిన రైతు కూలీ సంఘం సీనియర్ నాయకుడు సైకం శ్రీహరి (60) అనారోగ్యంతో శుక్రవార రాత్రి మృతి చెందారు. శ్రీహరి భౌతికకాయానికి శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు యు.వీరబాబు, జిల్లా సంఘం సహాయ కార్యదర్శి జన్ను జగన్, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు నివాళులర్పించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మిస్తాం

● తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం కానూరు అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మిస్తామని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. శనివారం కానూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. జనసేన నాయకులు దివి మహేష్, బొమ్మిడి పెద ఏడుకొండలు, పీతా రాము, సెక్రటరీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కోడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఈనెల 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మర్రపు పోలినాయుడు పిలుపునిచ్చారు. శనివారం కోడూరు పంచాయతీ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఇన్‌చార్జ్ కార్యదర్శి వై.తాతారావుకు సమ్మె నోటీసును అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు పోలాబత్తిన మోహనరావు, మత్స్య కార్మిక సంఘం నాయకులు కొప్పనాతి తాతయ్య, మోహనకృష్ణ, నాని పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

నాగాయలంక, జూలై 5(ఆంధ్రజ్యోతి): పూరిలో జగన్నాథ రథయాత్ర ముగింపు సందర్భంగా సునీల్ పట్నాయక్ - నిర్మలా ప్రాణాగ్రాహి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు శనివారం జగన్నాథుడి ముగింపు రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి రథంలో శ్రీకృష్ణుడు బలరాముడు, సుభద్ర విగ్రహాలను ఉంచి సంకీర్తనలు పాడుతూ పురవీధుల్లో ఊరేగించారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు



కోడూరు బైపాస్ రోడ్డులో మోకాళ్లతో నడుస్తున్న మౌనిక

మోకాళ్లపై వెంకన్న దర్శనానికి..

● కుమార్తె ఆరోగ్యం బాగుపడడంతో మొక్కు తీర్చుకున్న తల్లి

కోడూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కుమార్తె ఆరోగ్యం బాగుపడడంతో మూడు కిలోమీటర్లు మోకాళ్లపై నడుస్తూ ఓ తల్లి వెంకన్న దర్శనానికి వెళ్లి మొక్కు తీర్చుకుంది. కోడూరు శివారు శ్రీరాంపురం గ్రామానికి చెందిన కన్నా మౌనిక తన కూతురు ఆరోగ్యం బాగుండాలని శ్రీరాంపురంలోని తన నివాసం వద్ద నుంచి శనివారం కోడూరు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు మోకాళ్లపై నడుస్తూ వెళ్లి స్వామిని దర్శించుకుంది. తన కుమార్తెకు రెండు నెలల క్రితం పాము కరిచి ఆరోగ్యం క్షీణించిందని తన కుమార్తె ఆరోగ్యం మెరుగుపడితే వెంకన్న దర్శనానికి మోకాళ్లపై వస్తానని మొక్కుకున్నానని, ఆరోగ్యం మెరుగుపడినందున మొక్కు తీర్చుకున్నానని మౌనిక తెలిపారు.

అర్తమూరు పంచాయతీ భవన ప్రారంభోత్సవంపై సందిగ్ధం

బంటుమిల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అర్తమూరు గ్రామ పంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవంపై సందిగ్ధం నెలకొంది. గ్రామంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం నూతన భవన ప్రారంభోత్సవంపై పడింది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించాల్సి ఉంది. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. కానీ గ్రామంలో కూటమి, వైసీపీ కార్యకర్తల మధ్య ఏర్పడిన వివాదం వల్ల వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే సహకరించడం లేదంటూ వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ తీర్మానంతో ఎంపీడీవో, డీపీవోలను సంప్రదించి ఎమ్మెల్యే సహకరించకపోయినా భవన ప్రారంభోత్సవం చేస్తామని వైసీపీ నాయకులు అంటున్నారని కూటమి నాయకులు అంటు న్నారు. అధికారంలో తాముంటే పంచాయతీ భవన ప్రారంభోత్సవం ఎలా చేస్తారంటూ టీడీపీ నాయకులు నిలదీస్తున్నారు. సమస్యాత్మక గ్రామంగా పేరొందిన అర్తమూరులో నూతన భవన ప్రారంభోత్సవం ఎలాంటి పరిణామా లకు దారి తీస్తుందో అని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

నేడు శాకంబరిగా కొండాలమ్మ దర్శనం

గుడ్లవల్లేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తారని ఈవో ఎ.కొండలరావు తెలిపారు. ఆలయాన్ని 11 టన్నుల 250 కేజీల కాయగూరలతో, పండ్లతో, ఆకు కూరలతో సుందరంగా అలంకరిస్తున్నామని తెలిపారు.



ఆలయాన్ని అలంకరించేందుకు కూరగాయలు సిద్ధం చేస్తున్న భక్తులు



పీ-4 అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పీ-4 లక్ష్య సాధనకు సమష్టి కృషి

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేద్దామని అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గంలో పీ-4 అమలుపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి ప్రాజెక్టులను రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి డాక్టర్ నరసింహులు, ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎంపీడీవోలు విష్ణుప్రసాద్, ఎండీ ఇమ్రాన్, మల్లీశ్వరి, స్టాటిస్టికల్ అధికారులు ఆనంద్‌కుమార్, దీప్తి పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పదోన్నతులు కల్పించాలి

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని శనివారం డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, కె.ఎస్.రావు, సీసీఎస్ డెలిగేట్ సుబ్రహ్మణ్యం, రీజనల్ నాయకులు కె.వాణి, పి.కొండలరావు, సాయికుమార్, అజీజ్‌బాషా పాల్గొన్నారు.

కౌలురైతు బైకు చోరీ

పామర్రు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విజయవాడ ప్రధాన రహదారిపై గుడివాడ ఫ్లై ఓవర్ దిగువన ఓ కౌలు రైతు ద్విచక్ర వాహనం చోరీ అయింది. చేను గట్టు సమీపంలో చాట్ల మురళి అనే కౌలురైతు తన బైక్‌కు తాళం వేసి నిలిపి పొలానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే బైక్ లేదు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ద్విచక్రవాహనం చోరీ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో నమోదయ్యాయి. దీనిపై మురళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సకాలంలో సాగునీరందించాం

• ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో సాగునీరందించిందని, అందుకే రైతులు వరినాట్లు వేయగలుగుతున్నారని, వైసీపీ హయాంలో ఆగస్టులో నాట్లు వేసేవారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గుర్విందపల్లిలో గురువారం రాత్రి పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కరకట్ట పక్కన శ్మశానవాటికను అభివృద్ధి చేయించాలని, లాకురోడ్డులో సీసీరోడ్డు నిర్మించాలని, దళితవాడలో కమ్యూనిటీహాలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం పొలాలకు వచ్చి లుంగీ కట్టి వరినాట్లు వేస్తున్న కూలీలతో మాట్లాడారు. వారితో కలిసి నాట్లు వేశారు. పురుషులతో కలిసి నారు తీశారు. కొద్ది సేపు చేలో దమ్ముట్రాక్టర్ నడిపారు. మాజీ సర్పంచ్ గుర్రం బాపనయ్య, ఉప్పులూరి గోపాలకృష్ణ, తటుకూరి రమణ పాల్గొన్నారు.



గుర్విందపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన

పామర్రు: తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రూ.61లక్షల నిధులతో నిర్మించే అన్న క్యాంటీన్ నూతన భవన నిర్మాణానికి కూటమి శ్రేణులతో కలిసి శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భూమిపూజ చేశారు. జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, సాగునీటి సంఘం జిల్లా ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, నేతలు గొట్టిపాటి లక్ష్మీదాస్, తాడిశెట్టి మధు, మండపాక శంకర్‌బాబు, తహసీల్దార్ జి.రవికాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పమిడిముక్కల: కపిలేశ్వరపురంలో ఇటీవల వంట గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమై నష్టపోయిన కొడాలి నాగేంద్రబాబుకు తాతినేని ట్రస్టు ద్వారా ఎన్నారై విజయ్‌బాబు రూ.లక్ష రూపాయల ఆర్థిక సాయం పంపారు. చెక్కును ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ద్వారా అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాతినేని సాయిదత్తు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ధ్యేయం

కూచిపూడి: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభు త్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పద్దారాయుడుతోట, కాజ గ్రామాల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కూటమి నేతలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, బత్తిన శ్రీనివాసరావు, తాతా నారాయణరావు, బత్తిన మురళిపాల్గొన్నారు.

రూ.500 కమీషన్ ఆశచూపి రూ.25 వేలు కాజేశారు

తోట్లవల్లూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజసంగా కారులో వచ్చి రూ.25 వేలు దోచుకెళ్లిన ఘటన చాగంటిపాడు వద్ద కరకట్ట పక్కన పెట్రోల్ బంకులో శనివారం తెల్లవారుజామున జరిగింది. తెల్లవారుజామున 4.10 గంటలకు నెంబరు లేని కారులో నలుగురు వచ్చారు. ట్యాంకులో పాతిక లీట ర్ల ఆయిల్ నింపమన్నారు. వర్కర్ విష్ణుబట్ల వెంకటరమణ ఆయిల్ నింపాక రూ.2,470 ఇవ్వమని వారిని అడిగాడు. చేతిలో క్యాష్ లేదని, ఫోన్‌పే చేస్తామని కారులోని వ్యక్తులు చెప్పారు. వెంకటరమణ సరేనన్నాడు. వెంటనే వారిలో ఓ వ్యక్తి తాము ఆస్పత్రికి వెళుతున్నామని చేతిలో నగదు లేదని, రూ.25 వేలు కావాలని, ఫోన్ పే చేస్తానని తెలిపాడు. వెంకటరమణ ఒప్పుకొని రూ.25 వేలకు రూ.500 కమీషన్ ఇవ్వాలని వారిని కోరాడు. కారులోని వ్యక్తి సరేనన్నాడు. వెంకటరమణ వెంటనే రూ.25 వేలు తెచ్చి కారులోని వ్యక్తికి ఇచ్చాడు. ఫోన్ పే నెంబరు చెప్పమని కారులోని వ్యక్తి అడిగిన వెంటనే వెంకటరమణ చెప్పాడు. ఆ నెంబరును కారులోని వ్యక్తి ఫోన్‌పేలో కొట్టి విష్ణుబట్ల వెంకటరమణ పేరు వచ్చిందని చెప్పగా అదే నెంబరుకి డబ్బు పంపమన్నాడు. రూ. 25 వేలు ఫోన్ పే చేశామని వెంకటరమణకు చెప్పి కారును విజయవాడ వైపు తీసుకెళ్లారు. ఫోన్‌లో పరిశీలిస్తే నగదు జమ అవలేదు. తోట్లవల్లూరు వరకు బైక్‌పై వచ్చినా ఆ కారు జాడ తెలియలేదు. రూ.25 వేలు, ఆయిల్ డబ్బులు రూ.2,470 మొత్తం రూ. 27,470 కొల్లగొట్టుకుపోయారు. వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ కెమెరాలో రికార్డ్ అయిన కారు దృశ్యాలను పరిశీలించారు.

ఫార్మశీ విద్యార్థులకు వర్క్‌షాపు

గుడ్లవల్లేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మింగ్ డ్రగ్ డిస్కవరీ ఫర్ నెక్స్ట్ జన్ డ్రగ్ డవలెప్మెంట్ అనే అంశంపై వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, విజయవాడకు చెందిన లైలా న్యూట్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైలా న్యూట్రా ఆర్ అండ్ డీ జీఎం ఏవీ కృష్ణంరాజు, ఫార్ములేషన్ డివిజన్ జీఎం డాక్టర్ జి.కిషోర్‌బాబు, డాక్టర్ కె.కృష్ణ చైతన్య, డాక్టర్ కె.శ్రీనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, సదస్సు కో కోఆర్డినేటర్ డాక్టర్ పి.రవీష, కెరియర్ గైడెన్స్ అధికారి వి.ఎల్.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సదరం స్లాట్ బుకింగ్‌కు సర్వర్ సమస్య

పామర్రు, జూలై 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వ వైద్యులతో ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రభుత్వం సదరం స్లాట్ బుకింగ్‌కు శనివారం అవకాశం కల్పించింది. పలువురు దివ్యాంగులు గ్రామ సచివాలయాలకు స్లాట్ బుక్ చేసుకోవడానికి వచ్చారు. సర్వర్ మొరాయించడంతో చాలాసేపు వేచి ఉండి నిరాశతో ఇంటికి వెళ్లారు. మరో మూడు నెలల వరకు ఆగకుండా మరోసారి గడువు పెంచాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

పొట్టిదిబ్బలంక అంగన్వాడీ కార్యకర్త తీరే వేరు

తోట్లవల్లూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలోని మినీ అంగన్వాడీ కేంద్రం కార్యకర్త తిరుపతమ్మ విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కృష్ణానదిపాయల మధ్య ఉన్న పొట్టిదిబ్బలంకలో అంగన్వాడీ సేవలు మృగ్యమయ్యాయంటున్నారు. పొట్టిదిబ్బలంక నివాస గృహాలకు దూరంగా ఓ రైతు ఇంటిలో అద్దెకు మినీ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం నెలకు రూ.500 అద్దె చెల్లిస్తోంది. శనివారం ఉదయం 10 గంటలకు మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లగా మూసేసి ఉంది. ఆ అద్దె భవనం వద్ద అంగన్వాడీ కేంద్రం ఛాయలు కూడా కనిపించలేదు. శుభ్రత లేదు. చెత్తాచెదారం, దుమ్ముదూళి పేరుకుపోయి ఉంది. కేంద్రం పక్కనే పొలంలో పని చేస్తున్న ఓ రైతుని పిలిచి వివరాలు అడగ్గా 2025లో ఈ కేంద్రానికి ఒక్క పిల్లాడు కూడా రాలేదని, పది రోజుల క్రితం కార్యకర్త తిరుపతమ్మ వచ్చారని తెలిపారు. 11.30 గంటలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూజాతకు మీడియా ప్రతినిధి ఫోన్‌చేసి సమాచారం అడగ్గా కార్యకర్త అక్కడే ఉన్నారని చెప్పారు. కావాలంటే ఫొటో పెట్టిస్తానన్నారు. కానీ ఫొటో పెట్టలేకపోయారు. సూపర్‌వైజర్‌కు ఫోన్ చేసిన అరగంటకు (12.05 గంటలకు) తిరుపతమ్మ ద్విచక్రవాహనంపై వచ్చారు. తాను ఫేషియల్ యాప్ నమోదు చేసేందుకు గృహాలకు వెళ్లానని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ముగ్గురు పిల్లలున్నట్టు చెప్పారు. ఒక గర్భిణి, ఒక బాలింతకు దేవరపల్లి నుంచి బియ్యం, పప్పు, పాల కిట్టుని తెచ్చి అందిస్తానని, తాను రోజూ డ్యూటీకి వస్తున్నానని, కావాలంటే ఆ గృహాలకు వెళ్లి అడుగుదామని తిరుపతమ్మ అన్నారు.



పొట్టిదిబ్బలంకలో శనివారం తెరుచుకోని మినీ అంగన్వాడీ కేంద్రం

లోక్ అదాలత్‌లో 1,013 కేసుల పరిష్కారం

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మూడు కోర్టు బెంచ్‌ల ద్వారా 1,013 కేసులు పరిష్కారించామని, రూ.4.14 కోట్లు కక్షిదారులకు అందజేశామని 11వ అదనపు జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం తెలిపారు. 15 సివిల్ కేసుల్లో రూ.1.15కోట్లు, 997క్రిమినల్ కేసుల పరిష్కారం ద్వారా రూ.2.97కోట్లు, ఇతర కేసుల ద్వారా రూ.27వేలు కక్షిదారులకు అందినట్లు తెలిపారు. సహకరించిన ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీసు, బ్యాంకు అధికారులకు న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి గాయత్రి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వాసుదేవ్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జడ్జి సుబ్రహ్మణ్యం

రోడ్డు ప్రమాద బాధితురాలికి రూ.45 లక్షల పరిహారం అందజేత

బైపాస్‌రోడ్డులో జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కల్యాణపు చంద్రావతి కేసులో యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.45 లక్షల నష్టపరిహారాన్ని అందించారు. దావా పరిష్కారానికి కృషిచేసిన న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావుకు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు చంద్రావతి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మొవ్వలో 274 కేసులు పరిష్కారం

కూచిపూడి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మొవ్వ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత వోల్గా మార్క్స ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 274 కేసులకు పరిష్కారం లభించింది. కూచిపూడి, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి స్టేషన్ల పరిధిలోని సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఆయా స్టేషన్ల ఎస్ఐలు కేఎన్ విశ్వనాథ్, ప్రతాప్‌రెడ్డి, వై.వి. సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



మొవ్వలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి స్వర్ణలత వోల్గా మార్క్స



గుడివాడలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలకు భారంగా ఉన్న స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని, బిగించడం నిలుపుదల చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు నిరసన తెలిపారు. బీజేపీకి తొత్తులుగా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు స్మార్ట్‌మీటర్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు జి.శేషు, కె.వెంకన్న, భూషయ్య, నరేంద్ర, బాబ్జీ, రంగా, జోజి, రవి పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన పది మందికి రూ.లక్ష జరిమానా

గుడివాడ రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందికి ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున రూ.లక్ష జరిమానా విధించినట్టు తాలుకా ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. శనివారం మండలంలో పలుచోట్ల ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రూరల్ సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామంలో డాక్టర్ సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సీఎల్ వెంకట్రావు గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు డెంటల్ వైద్యకళాశాల వైద్యులు ఉచిత దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడ పీవీఆర్ హాస్పిటల్స్ వారు ఈసీజీ పరీక్షలు చేశారు.

పట్టణ బంద్‌కు అనుమతి ఇవ్వండి

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలని ఈ నెల 9న చేపట్టిన గుడివాడ బంద్‌కు, మైక్ ప్రచారానికి అనుమతి ఇవ్వాలని అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అభివృద్ధి కమిటీల నాయకులు డీఎస్పీ ధీరజ్ వినీల్‌ను కోరారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. సమన్వయ కమిటీ సభ్యులు బీవీ శ్రీనివాసరావు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కె.ప్రభుదాసు, ఎస్.మరియమ్మ, ఆర్.శివప్రసాద్, బీవీ రమణ, సురేష్ పాల్గొన్నారు.

శునకాలు, పిల్లులకు ఉచిత వ్యాక్సినేషన్ నేడు

గుడ్లవల్లేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): జునోసిస్ డే సందర్భంగా ఆదివారం గుడ్లవల్లేరు పశువైద్యశాలలో లయన్స్ క్లబ్, డివిజనల్ పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఏఆర్వీ వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ ఉచితంగా పెంపుడు శునకాలకు, పిల్లులకు వ్యాక్సిన్ వేస్తామని క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లు, పశువైద్యశాల ఇన్‌చార్జ్ డాక్టర్ హనుమంతరావు తెలిపారు.

బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోండి

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన ఎస్సీ విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన తల్లికి వందనం పథకం నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఎస్సీ సంక్షేమ సాధికారిత అసిస్టెంట్ అధికారి టి.వెంకటకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తల్లి బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు, ఎన్‌పీసీఐ లింకు చేసి ఉండాలన్నారు. ఖాతా లేని విద్యార్థులు పోస్టాఫీసులో ఖాతా తెరవాలని సూచించారు.

కార్మికుడికి రూ.10 వేలు సాయం

గుడివాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని రషీద్‌బేగ్ షెడ్‌లో వెల్డర్‌గా పనిచేస్తూ ఇటీవల 22వ వార్డుకు చెందిన షేక్ అబ్దుల్ సమద్ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఎడమ చేతికి గాయమవడంతో ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ తరఫున రూ.10 వేలు అందజేశారు. శనివారం కార్మికుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ అందజేశారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గ్రామంలో శనివారం అమ్మవార్లకు ఆషాఢ సారెలను భక్తులు సమర్పించారు. రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో రమాదేవికి మాజీ ఉపసర్పంచ్ అడుసుమిల్లి సుబ్బయ్య ఇంటి నుంచి వారి కుటుంబసభ్యులు, సత్యదేవుని భక్తులు సారెను తీసుకెళ్లి సమర్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని వినాయకుడి ఆలయం నుంచి భక్తులు సారెను తీసుకెళ్లి సమర్పించారు. వేమవరం కొండాలమ్మకు బందరు మండలం భోగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఆషాఢ సారె సమర్పించారు.



గుడ్లవల్లేరులో సారె తీసుకెళుతున్న మహిళలు